# సజ్జన మైత్రి

శ్రీమతి చిల్కపాటి సీతాంబగారు

కమల యీజీచేరులో గూరుచుండి పుస్తకమును చదువుచుండ ప్రక్కయింటిజానకి చాపమీదగూర్చొని ఆకులు గుట్టుకొనుచుండెను.

కమల — జానకీ! యీపుస్తకంలో స్నేహము అను శీర్షికగల భాగమెంత హృదయస్పర్శంగా వున్నదో చూచితివా?

జానకి—చూచితిని. ఆకథాపురుషుడు తనస్నేహితుని కష్టములనుదీర్ప తన సర్వస్వమును వెచ్చించి తుదకు వాని నున్నతస్థితికిదెచ్చి కృతప్రయత్నుడయ్యెనుకదూ.

కమల — ఔను. స్నేహమనన ట్లుండవలె. తక్కినవి ముఖప్రీతిస్తోత్రములు. బూటకపుమర్యాదలు. అట్టి యతి వినయము లెన్నటికిని కష్టములం గడుపనేరవు. ఆడాంభికస్నేహములకే 'శుష్కప్రియములు శూన్యహస్తములు' అను పేరు వచ్చినది.

జానకి — ఔనమ్మా! యీకాలమున నెటజూచినను అట్టి మర్యాదలే జాస్తి. మనోవాక్కర్మములచే మైత్రి బాటించి యాదరించు మీవంటి మనీషావతులు నూటికొక్కరుందురేమో.

కమల — అదేమిమాట నీకు నేనేమి యుపకరించుచుంటిని. పాపము పేదరాలివి. పిల్లలతో నీవుపడేజాలి చూడలేకున్నాను.

'అమ్మా టిఫిన్ తయారైంది' అని లోపలినుంచి కేక.
కమల — జానకీ! లోపలికిరా.

జానకి — పిల్లలు గోలపెట్టుచున్నారు. యింటికి వెళ్లుచున్నాను.

కమల రాజమండ్రిలో గొప్ప న్యాయవాదులైన మాధవరావుగారి సతీమణి. భాగ్యమా ఒకగొప్పజమీందారంత. సంతానం లలితయను నొక్కబిడ్డ. అల్లారుముద్దుగా పెంచుకొనుచుండిరి.

జానకి ఒక పేదకుటుంబిని. సత్కులప్రసూత. విద్యావతి. భారత భాగవతాది పుణ్యకథలంజదివి చక్కగా నుపన్యసింపగలదు. తాను పూర్వాచారపరాయణుల యొద్ద పెరిగినను నవీను లుపపాదించు సదాచారములన్న నామె కభిరుచిమెండు. స్త్రీలకు విద్య అవసరమనియు బాల్యవివాహముల ద్రోసి వాటి విషయమున స్త్రీలకును పురుషులతోపాటు స్వతంత్ర మొసగుచు యువతీవివాహములొనర్పదగుననియు నామెవాదము. చేతగాని పిన్నమ్మ మూతి విరుగబొడిచినట్లు ఓ యను నక్షరమున కెన్ని వంకరలో యెరుగని మూర్ఖాచార పిశాచబంధువు లామెనుచూపి మూపిగాల్చిపోసేవారు. లెక్చర్లిచ్చి ఉద్యోగాలేసి పూర్లేలుతుందని అధిక్షేపించేవారు. అవంతా ఆమె లెక్కజేయలేదు. అంతస్తు తగ్గియుంటే ఆచారాలంతా మంచివేయైనా అందరూ యేదో యొకవిధంగా ద్రేళ్లుమాపేవారే. అతిశయంగా వుంటే అందరూ అనుసరించేవారే. సజ్జనులైతే మైత్రే పాటిస్తారుగాని వేలెత్తరు. అట్టివారెప్పటికీ వున్నవాళ్లే. ఒకటిరెండు కుటుంబాల శ్రీమంతులామెపై యభిమానముంచి మైత్రి పాటించుచుండిరి. వారిలో కమలం ముఖ్యురాలు. ఆమె పరోపకారశీల. నిర్దంభజీవన శాంతస్వభావ. ఆమెకు జానకియంటే పంచప్రాణం. యెన్నియోవిధముల సహాయపడేది.

ఐనా 'ధనపతిసఖుడైయుండియు నెనయంగా శివుడు బిచ్చమెత్తగ వలసెన్.' 'తనవారికెంతగల్గిన తన భాగ్యమెతనకు' అనిన సుమతి పలుకులవలె ఆమె కష్టములు గడచువిధముకుపడలేదు. జానకికి శ్రీహరి, రాఘవుడు, గోవిందుడు, [illegible]

దైవవైపరీత్యముచే నామె అనాధ[illegible] [illegible] భారమంతయు ఆమె తలయందే పడినది. [illegible]

బోసిన దేవుడు నీరుబోయడా అను ధైర్యంతో నామె యెటులో కాలముగడపుచుండినది.

శ్రీహరి—అమ్మా! రేపు శ్రీరామనవమి పండుగ గదూ. దేవుడికీ మాకూ యేమన్నా చెయ్యవూ.

రాఘవుడు—నిన్న వుగాదిపండుగకు చేసిపెట్టింది. పాపం ఆకొదవ రేపునవమికి చేసిపెడుతుంది.

గోవిందుడు—అమ్మకు కుళ్లుబోతుతనంరా అన్నయ్యా యేమన్నాచేస్తే మనం దింటామనీ.

పద్మ—కాదురా! వోరే అన్నయ్యా చాటుగా జేసుకొని అంతా అమ్మేతినేస్తుంది మనకుబెట్టితే ఐపోతుందనీ.

జానకి—పోనీ నా చిట్టితల్లీ యీ మాటలంతా యెప్పుడు నేర్చుకున్నావే చేతిలో యేమీ లేదు. నేనేం చేసిపెట్టేది.

రాఘవుడు—ఎప్పుడడిగినా లేదూ లేదూ. ఇంకెప్పుడుండేది.

జానకీ—యెప్పటికీ యింతే. నిర్భాగ్యురాలిని నన్నెందుకు పీడిస్తారు.

గోవిందుడు—ఇంకెప్పటికీ అడగంగానీ నాలుగు గారెముక్కలైనా చేసిపెట్టమ్మా. నిన్న చిన్నిచెల్లాయీ నేనూ యెదుటింటి రత్నంతోగూడ ఆడుకొంటూ వుంటే వాళ్లమ్మ ఆ అమ్మాయికి జీడిపప్పూ పంచదారా తినబెట్టుతూ మమ్మల్నిజూచి మురికిగుడ్డలతోటి మానిమ్ముంతల్లాగ మాపిల్లని ముట్టుకోకండి. వెళ్లండని తలుపుమూసుకుంది.

రాఘవుడు—అందుకేనమ్మా చెల్లాయి గోవిందూ వాళ్లింటినించి నిన్న యేడుస్తూవచ్చారు.

జాన:—అయ్యో దేవుడా! మ్రొక్కనెత్తిన చేతులపై మొత్తివిరుగగొట్టినట్లు అమాయకులై ఆడబోయిన మీమీదనా ఆభాగ్యశాలిని తన యైశ్వర్యగర్వం చిరాకు చూపింది. ఔను అనుభవపూర్వకముగా కష్టసుఖములు కలిమిలేముల పరివర్తనములు గుర్తెరిగి ప్రపంచస్థితి బాగుగా కన్నుగలిగి చూచువారితరుల నంత కఠినముగా తృణీకరించరు. అట్టివారిసంఖ్య నూటిలోఒక్కవంతు. తల్లీ ఆడుకొనుటకిక పొరుగిండ్లకు వెళ్లకు. వారికి నౌకరుల వూడిగాలకంటే నీకు సోదరుల ప్రేమము ధన్యతమమైనది. వారి నౌకర్లభక్తి ద్రవ్యమిస్తే వచ్చినది. నీకో సౌభ్రాతృత్యభాగ్యమే దైవమనుగ్రహించెను. అన్నయ్యలతో నాడుకొందువుగాని మరియొకరి పంచలకేగకు.

శ్రీహ—పొగరుబోతువాళ్లు బాలులను తిరస్కరంచేస్తే దేవుడు కోపిస్తాడని యెరగవు. పంతులుగారు చెప్పినట్లు అధికారరోగంవచ్చి బధిరులు అంధులు ఐనారు.

గోవిం—ఆమ్మా వాళ్ల రత్నం వాళ్లను యెత్తుకునేటందుకు వీధుల్లో తిప్పేటందుకు దాదులున్నారే. మా కేరీమరీ.

జాన—నాకూనా. వాళ్లకిచ్చాడా దేవుడంతా. మనకివ్వలేదు.

రాఘ—ఆ దేవుడు పక్షపాత బుద్ధికలవాడు. ఆయనను నమ్మనేగూడదు.

శ్రీహ—ఛా అట్లనరాదు. సృష్టిజేసేవిధంలో వాళ్ల నొకవిధంగా మనల నొకవిధంగా యేమైనా చేశాడా ఆ దేవుడు.

గోవిం—అంటే మాకు దెలియలే.

శ్రీహ—కాళ్ళూ చేతులూ ముక్కూ కళ్ళూ నోరూ తలా వొళ్ళూ యివన్నీ వాళ్లతోపాటూ మనకూయిచ్చాడా లేక యేమీ లేనివాళ్ళమని మనకేమన్నా తగ్గించాడా ఆ దేవుడు.

రాఘ—లేదు. అందరికీ సరిగానేయిచ్చాడు.

గోవిం—యిస్తే?

శ్రీహ—యెవరికిగాని వాటివల్ల వుపయోగం తెలుసునా!

## సజ్జనమైత్రి

గోవిం—కాళ్లు నడిచేటందుకు, చేతులు పనులు చేయుటకు, చెవులు వినుటకు, ముక్కు వాసనతెలుసుకొనను, కండ్లు చూచుటకు, తల మొదలైన తక్కిన అవయవములు వానివాని ప్రయోజనములు నెరవేరుస్తూవుంటే దేహయాత్ర జరుపుకోదగిన వుద్దేశ్యంతో దేవుడు మనుష్యకోటినంతా సమానంగా సృష్టించాడు.

గోవిం—అందుకనేనా, అమ్మ తెల్లవారిజాము నే లేచి రాత్రి పదిఘంటలదాకా మూలుగుతూ ఆయాసపడుతూ మానకుండా యేదో పని చేస్తూనేవుంటుంది.

జాన—యేం జెయ్యమన్నారు బాబూ. కుడిచి సుఖంగా కూచునే నోము నేనోచుకొనలేదు. నిరంతరం కష్టజీవిని.

పద్మ—అమ్మా నేం చేసిపెడుతా లేవే పనంతానూ. నువ్వు కష్టపడొద్దు. వూరికే కూచోనుండు. నిన్నంటే నాకు చాలాఆశ. నువ్వు ఆయాసపడితే నాకు దిగులేస్తుంది.

జాన—వోసీ! నా వరాలతల్లీ! అమృతప్రవాహంలో నన్ను ముంచితేల్చావే. నీ ప్రేమపూరిత పవిత్రహృదయంలోనుంచివచ్చిన ఒకముద్దు మాటతోటే నా కష్టాలన్నీ తీరినట్లేవున్నవి చిట్టితల్లీ. నీ ముద్దుమాటయే నాకు వరాలమూట యింకేమి గావలె. కుడిచి కూరుచుండి నిర్వ్యాపారముగా గోళ్లుగిల్లుకుంటూ కుళ్లికునారిల్లే దానికంటే కష్టపడి కాలూ రాతిరిగి చెయ్యగా పని చేసి తీరుబడి క్షణంలో యిట్లుముద్దుబిడ్డలతో సత్కాలక్షేప మొనర్చునదే సుఖజీవనము. నాకింతకన్న కోరదగిన దిక నేమున్నది.

పద్మ—అట్లాఐతే అమ్మా ఆకలేస్తుందే అన్నం బెట్టవూ?

రాఘ—నా కన్నంవొద్దే అమ్మా పొద్దునాగూడా నెయ్యిలేకుండా వొట్టిపచ్చడి అన్నంబెడితే తినలేక పోయాను.

గోవిం—అమ్మా వొక్కరోజన్నా నెయ్యి వెయ్యవుగదూ.

పద్మ—అమ్మా మమ్మలూరికే ముద్దులెట్టుకొంటూ ముచ్చటపడుతూ వుంటావే, నెయ్యిలేకుండా బువ్వ పెడితే మరీ కారమేసీ మాకళ్లు చుట్టుకొస్తే నీకు దిగులెయదూ!

రాఘ:—అదేమిటే అమ్మా?

గోవిం—యేడుస్తావెందుకే?

పద్మ—మే మేమీ అడగంలేవే అమ్మా. నువ్వు పెట్టిందే తింటాంలే. అల్లరిచెయ్యం. నువ్వేడిస్తే నాకూ యేడుపొస్తుంది. మామ్మ గదూ. వూరుకో యేమీ అడగంలే. అన్నయ్యాలూ అమ్మనడగొద్దు.

శ్రీహ—అరుగో కమలమ్మగారు.

జానకి—రా కమలా! యేమిటదీ?

కమల—యేదో కొంచెం పిల్లలకుబెట్టు ఆకలిగొన్నారు పాపం.

జానకి—పూటపూట యిదేమి తేవడం కమలా.

కమల—ఆమాటనకు పరవాలేదు. మేము దినుట మీరూరకుండుటయా. దైవము మాకొరకే యిచ్చెనా. సజ్జనులకు సాయపడుమని కూడ?

జానకి—పిల్లలనంపుమన్న రారా యిందులకై పళ్లెము మోసుకొని నీవు నడచి వీధివెంట రావలయునా.

కమల—నీయందుగల గౌరవముకంటె స్నేహము కంటె నాకీపళ్లెము బరువైనదా. సుహృజ్జనులను దర్శించుటకు నడచివచ్చుట గౌరవహానియా. వాహనాదులు వలయునా. ఆరాణివాసపు నడకువలన్నియు బూటకపు వేషములు. పిల్లలకిమ్మా తరువాత రమ్మా మాయింటికి.

జానకి—అటులే మంచిది.

రాఘ—యివెంత బాగున్నాయే. అమ్మా ఒక్కనాడన్నా యీలాంటివి చేసిపెట్టవు మాకు. అడిగితే యేడుస్తావు.

గోవిం—యీలాంటివి తినేందుకు లేకుండా—

పద్మ—కట్టుకునేందుకు మంచి పరికిణీల్లేకుండా—

రాఘ—యెన్నాళ్లు కష్టపడవలెనమ్మా మనము.

శ్రీహ—పంతులు చెప్పినట్లు ప్రార్థనచేస్తాను. దేవుడు మనందరికీ—

జానకి—ఒక్కసారే ఆమాటతోటే జానకిముఖంలో విచారమంతా మాయమైంది. తలవూపింది. పెద్దనిట్టూర్పు విడిచింది. గోడనపటంలో వుండే లక్ష్మీనారాయణ మూర్తినిజూచి ఒక్కనమస్కారం చేసింది.

శ్రీహ—తమ్మా అస్తమానమవుతూవుంది. దీపానికి చమురేదుగదూ పెందలాడే పాటాలు చదువుకోని పడుకుందాంరా.

పద్మా—అమ్మా బువ్వలేదుగదూ పడుకోంటా. కాస్పేపు చిచ్చిగొట్టు నిద్దరబోతా.

జాన—హా భగవంతుడా! మాకందరికీ వక్కసారే పెద్దనిద్దుర ప్రసాదింపుము. యీకష్టజీవిత మిక గడుపజాలను. యీ ముద్దుబిడ్డల యిడుములంజూచి సహింపలేను. * * *

రాత్రి రెండుజాములైనది. గోదావరీనది గంభీరముగా ప్రవహించుచున్నది. గట్టున జానకి తదేకదృష్టితో నిలుచుండియున్నది. చిన్నపిల్ల పద్మ భుజముపై నిదురించుచున్నది. తక్కినపిల్లలు గట్టున యిసుకపై బరుండి నిదురించుచున్నారు. పాపము వారచ్చటికెందులకు వచ్చిరో యెట్లు తేబడిరో వారెరుగరు.

జానకి గంభీరస్వరముతో నిట్లు చెప్పినది.

"ఓగోదావరీప్రవంతినీ! అమృతస్వరూపిణీ! యీ కష్టమయజీవన కుటుంబమునకు నీ యమృతగర్భమున నించుక తావొసంగుము. ప్రపంచమునంగల సమస్త జీవకోట్ల పాపపంకిలములను భవదీయ స్పర్శమాత్రమున మాయించి పరిశుద్ధుల చేయుచున్నావు. భగవతీ నీకరుణారసప్రవాహ పరిప్లుతంబై బెండువడియున్న యూసరక్షేత్రంబులు సైతము సమృద్ధసస్యఫలవంతములై అగణితప్రాణికోటి కమృతమును ప్రసాదించుచున్నవి. ఓ గిరిరాజపుత్రీ! నీ పుట్టువు అఖిలచేతనో జీవనంబునకై యిలపైవెలసినది. నీ గమనంబులు దుస్సహతాపతప్తస్థావరజంగమాత్మక జీవసముదాయమునకు జీవదాయంబులు. నీదర్శనముపతితపావనము. తల్లీ! దుర్భరంబులగు సంసారవిప్లవముల భరింపనేరక అగతికులై యమాకులగు నీ నిసుగు లనుభవించు నిడుములంగడుపజాలక కులోచిత గౌరవములంబాటించి చేరదీసి యాదరించు నాప్తులంగానక అసహాయనై నిగుపేదనగుట అజ్ఞాన ధనగర్వచిత్తులగు జీవలోకపరాభవముల సహింపనేరక తల్లీ నిన్ను శరణుజొచ్చితిని. శిశుఘాతిని. ఆత్మహత్యామహాపాతకిని రక్షింపుము. అనుచితములగు బాల్యవివాహము లాచరింపబడినవారికిని పెద్దలయవివేకముచే సంసారసంరక్షణోపాధియగు నున్నతవిద్య లభ్యసింపబడక అసమర్థలై కర్తవ్యతామూఢలై తపించు నభిమానవతులను చేరదీసి చల్లని నీకడుపున దాచుకొనుము. 'నస్త్రీస్వాతంత్ర్యమర్హతి' అను దారుణాశనిచే అబలాలోకము నధఃపతనము నొందించుట అన్యాయమని చల్లని నీ కరములెత్తి యుద్ఘోషింపుము. అమృతస్వరూపిణీ నీ కివే పదివేలనమస్కారములు. వచ్చుచున్నాను."

అని యామె వెనుకకుమరలి నిదురించు పిల్లలవద్దకి వచ్చినది.

హా బిడ్డలారా "యీ మందభాగిని యుదరమున బుట్టకుండినచో మీ కీ దుర్మరణములు ప్రాప్తించకుండెడివిగదా! అయ్యో దైవమా" అని యొక్కనిట్టూర్పు విడచినది. ఒక్కొక్కరినే యెత్తుకొన నుద్యుక్తయైది.

అంతలో నొకవ్యక్తి యట కతివేగమునవచ్చి 'సాహసము మానుమాను' అని కేక వేసినది.

జానకి వెనుకకు మరలి "అయ్యో కష్టసాగరమును తరింపనీక అడ్డువచ్చిన దెవ్వరు నా దౌర్భాగ్యదేవతయా."

వ్యక్తి—జానకీ! యింతసాహసమున కొడిగట్టితివా.

జాన—కమలా నీవా యిపుడిట కెట్లువచ్చితివి.

కమ—సాహసమువదలి చిరంజీవులతో నావెంట రమ్ము తరువాత చెప్పెదను.

జాన—అమ్మా అన్నవస్త్రముల కిడుములంబడు నీ యర్భకులంజూచి సహింపనేరక అందర మొక్కటే సారి యీ యాపత్సాగరమున మునిగితిమేని యన్నియు దీరునని యీ గోదావరీప్రవంతిని శరణుజొచ్చితిని. యీ నిర్భాగ్యకుటుంబ మింకను పుడమిపై యిడుములం బడవలసియుండుట నీచే వారింపబడినది.

కమ—జానకీ! ఆపదలు కాపురములుచేయునా. కష్టసుఖములు కావటి కుండలవంటివిగదా. నిసుగు లిపుడు కష్టపడిన వెనుక సుఖింపరా. కష్టములకులోనైన వారెంతటి మనీషావంతులైనను కార్యాకార్యము లరయ నేరరనుట నీయెడ తార్కాణమయ్యె.

జాన—నాకష్టములు కాపురములే చేయుచున్నవి. నేనేమి యుద్యోగమొనర్చి యూళ్లేలి యీ శిశువుల నభివృద్ధికి దేగలను. నిలువనీడయు కుడువతోడుగ నన్నవస్త్రములును లేక దీనులై యలమటించు నీ పాపలనుజూడ నా హృదయము నీరగుచున్నది. చేరదీసి రక్షింపమన్నను యెల్లిదముగ ప్రేల్లుసూపు నితరుల నిర్దాక్షిణ్యములు కని విని నామనస్సు నొచ్చిపోయినది. కలిగియున్న మహాభాగులను గౌరవించు నుదారులేగాని అన్నవస్త్రములులేక అలమటించుచు క్షీణించు పేదకుటుంబముల కించుక జీవనోపాధిగల్పించు ధర్మసంస్థలు లేవయ్యె. సమర్థులగు దేశప్రముఖుల కట్టియాశయములే కలుగవయ్యె. యిక నిట్టి యగతికుల కీభారతదేశమున నాశ్రయమెచ్చట.

కమ—అమ్మా అశరణ్యశరణ్యుడగు పరమేశ్వరుడు లేడా యేమి. యుద్యోగమొనర్చి యూళ్లేలకున్న కుటుంబరక్షణ మొనర్చుకొనుట కిక సన్మార్గములు లేవా యేమి. హిందూవనితలు గడపదాటకయే దేశసేవయు స్వరాజ్యసంపాదనోపాధియు నగు కొన్ని మార్గములు మహాత్ము డుద్బోధించియుండుట విస్మరించితివా ?

జాన—ఔను కమలా నీ సదుపదేశముచే నా యజ్ఞానమంతరించినది. నేడుమొదలుకొనియే మహాత్మునియుపదేశము లౌదలదాల్చి ఆవిధముననే దేశసేవయొనర్చుచు కుటుంబరక్షణమునకుం గడంగెద.

ఆయూరిలో నూలువడకు ప్రచార మతి యెక్కుడుగనుండెను. మేల్తరంనూలు దీసినవారికి దేశనాయకులు నూటపదార్లు బహుమాన మిచ్చుచుండిరి. ఏ యింట జూచినా దుష్టదానవ గర్వనిర్వాపణ మొనర్పు నిరంతరము పరిభ్రమించుచు ధర్మమేవజయతి యనుచు చెచ్చెర్ని నాదమున నుద్ఘోషించు హరిచక్రమువలె స్వరాజ్యరథచక్రమగు రాట్నపుచక్రము భారతమాతదాస్య నిర్మూలనోత్సాహముం జాటుచు తానయ్యెయున్నది. రాట్నము వడకువారిలో జానకమ్మ నూలు మేల్తరం. తక్కినవారి నూలుకంటె ఆమెనూలును మిల్లులవారు నేతవారు రెట్టింపువెలనిచ్చి కొనిపోవుచుండిరి. ఆమెనూలునుజూచి సంతసించి గృహిణియు పేదకుటుంబినియు నని రెట్టింత గౌరవభావములచే దేశనాయకులు తరచు ఖద్దరు ప్రచారసభలలో నూటపదార్లామెకు బహుమతులిచ్చుచుండిరి. మరియు కుశాగ్రబుద్ధియగు నామె హిందీభాష నక్రమమున నభ్యసించి చుట్టుపట్ల బాలికల కతిసులభముగ నభ్యసింపజేయుచుండెను. ఆమె బోధనాకౌశలమునకు సంతృప్తినొంది ధనికులగు వారు తమబాలికల నామెయొద్ద హిందీభాషాపఠనముకై పంపుచు వలదన్నను పూజ్యభావమున నామెకు మాసవేతనము లంపుచుండిరి. ఆమె కుటుంబమునకగు ద్రవ్యము హిందీప్రచారమునచే వచ్చుచుండెను. నూలునకై వచ్చునదియు అపుడపుడు ఖద్దరుప్రచార సభలలో వచ్చు సన్మానధనమును నామెకు నిలువ యగుచుండెను.

సిరిదావచ్చిన వచ్చును సలలితముగ నారికేళ సలిలము భంగిక. రెండు మూడు వత్సరములగుసరికి జానకమ్మ కుటుంబస్థితి సామాన్యసంసారములను వెనుకవేసి ధనవత్కుటుంబముల గౌరవస్నేహములకు స్థానమైనది. శ్రీహరి తన సోదరులతో ప్రతి పరీక్షలయం దుత్తీర్ణుడగుచు విద్యావంతుల యాదరణములకు పాత్రులగుచుండెను. ఇక పద్మయో భూలోకమున నవతరించిన సాక్షాత్పద్మయే. ఆమె కేమి తక్కువ.

ఎప్పుడు సంపదగల్గిన అప్పుడు బంధువులు వత్తురన్నట్లు జానకమ్మగారితో వియ్యమందుటకు బంధువులపై బంధువులు వచ్చుచుండిరి. పూర్వస్థితియందు వారి నిలు సేరనీయనివారు యిపుడు బంధుత్వమునకై పలుసారులు వచ్చుచు ప్రస్తావింపసాగిరి. జానకి కష్టకాలములో కనికరించి మైత్రిపాటించి సమస్తవిధముల సాయమొనర్చి యామె పురోభివృద్ధికి దారిసూపిన యుదారస్వభావయగు కమల జానకి బాంధవ్యమునకై యుత్సహించుటొక వింతగాదు. నీరక్షీరములవలె నన్యోన్యమైత్రిచే నలరారు నా ధీరోదాత్తచరితల స్వభావములు భేదించునా.

* * *

సాయంకాల మారుగంటలైనది. గోదావరీనది ప్రశాంతముగ ప్రవహించుచున్నది. వేసవికాలమగుటచే చల్లనిగాలులకొరకు జను లా నదీపులినతలములయందు వచ్చి విశ్రమించుచుండిరి. కమలయు జానకియు తమ ముద్దుబిడ్డలతో నా యేటియిసుకతిన్నెలపై గూరుచుండి మానసోల్లాసముగ ముచ్చటించుకొనుచుండిరి.

కమల—జానకీ! నిన్నొక సంగతి ప్రస్తావింపనుంటిని యేమనవుగదా.

జానకి—కమలా యెంతమాట. నీ మాటకు నే నేమో అనుకొందునా చెప్పు.

కమల—మీ లలితనిచ్చి —

జానకి—మీ శ్రీహరికి పెండ్లి సేయుటకంటె మహానంద మేమున్నది.

కమల—అందులకే చిరకాలమునుండి నేను ముచ్చటపడుచుండినది. సంబంధ మొనర్చుకొనుటకు నీ కాత్మబంధువులు చాలమంది గలరని యీవిషయము నేను ప్రస్తావించుటకు సంశయించుచుంటిని.

జానకి—ఆత్మబంధువులన నెవ్వరు? కష్టకాలమున మొగములు మాటుపరచి కలిమివచ్చినపుడు చుట్టుకొనువా రంతశ్శత్రువులుగాని యాత్మబంధువులెన్నటికైన నగుదురా. కష్టదశలోనున్న నన్ను కంటికి రెప్పవోలె కాపాడి ఆపదనుండి బాపిన పుణ్యచరితవు. నీకంటె నా కాత్మబంధువు లెవరు. నీ బాంధవ్యమునకంటె నా కిక కోరదగిన మహాభాగ్యమేమున్నది.

కరుల—నీ సత్స్వభావమే నీ కష్టముల గడపినది. దైవము నీ కుటుంబమును రక్షించెను. మనీషావంతులగువారిని మనఃపరీక్షచేసియే దైవము శుభము లొసంగును.

జానకి—దైవానుగ్రహబలముననే నీవంటి దయావతి ప్రాపునాకు గల్గినది. సజ్జనమైత్రికి ఫల మిటులే గదా లభించును. భోజనకాలమైనది. మరల రేపు వత్తము పద.

కొలది వత్సరములకు ముందు పలుకష్టములకు లోనై చిన్నపాపలతో గోదావరి నదీగర్భమున జొచ్చుట కుద్దేశించి పాపల దురవస్థకై యీ నదీపులినములందు వాపోయిన జానకి నేడీ సైకతస్థలములందే తన ముద్దుకుమారుల వివాహములకై సంతోషముగా ప్రసంగించుచున్నది. కమలా స్నేహబల ప్రభావమునకే గదా యిట్లామె శుభోదయ మొందినది.

సజ్జనమైత్రి యిట్టిదే.